తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460



https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
23 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 195
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com


## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో


# రెన్యూ ఎనర్జీ గ్లోబల్

- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్
- నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి,ఏప్రిల్ 22 తరంగాలు ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా

➤ మిగతా 2వ పేజిలో..



## తమిళనాడులో నేడు

# ఒకే విడతలో పోలింగ్

- 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- బెంగాల్లో 152 స్థానాలకు తొలి విడల పోలింగ్ ఏర్పాట్లు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22 తరంగాలు ప్రతినిధి: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అలాగే బెంగాల్లో తొలిదశ పోలింగ్ జరుగనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది సరంజామాతో తమకు అప్పగించిన కేంద్రాలకు చేరుకున్నారు. తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్

➤ మిగతా 2వ పేజిలో..

# త్రిస్సూర్ బాణాసంచా పేలుడు ఘటన

## రాష్ట్రవిపత్తుగా ప్రకంటించిన ప్రభుత్వం

తిరువనంతపురం,ఏప్రిల్ 22 తరంగాలు ప్రతినిధి: : కేరళలోని త్రిస్సూర్ లో బాణా సంచా పేలుడు ఘటనను విజయన్ ప్రభుత్వం బుధవారం రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. ఈ ఘటనను రాష్ట్ర విపత్తుగా కేరళ మంత్రివర్గం బుధవారం విపత్తు నిర్వహణ అథారిటీని ఆదేశించింది. ఈ ప్రమాదంపై న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ సి.ఎన్. రామచంద్రన్ నాయర్ నేతృత్వంలో న్యాయ కమిషన్ పర్యవేక్షించనుంది. మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల అత్యవసర ఆర్థిక సహాయం అందించనున్నట్లు విజయన్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుండి రూ.4 లక్షలు, సిఎం విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ ఎఫ్)నుండి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపింది. గాయపడిన

➤ మిగతా 2వ పేజిలో..

# మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత
- మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం



హైదరాబాద్,ఏప్రిల్22 తరంగాలు ప్రతినిధి: (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరు లో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు

➤ మిగతా 2వ పేజిలో..



## కాళేశ్వరంపై ఎవ్వరికీ

# క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్,ఏప్రిల్ 22:తరంగాలు ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్

➤ మిగతా 2వ పేజిలో..

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక
- రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి
- హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్ 22 తరంగాలు ప్రతినిధి: కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం

➤ మిగతా 2వ పేజిలో..

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రీగ్ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి




హైదరాబాద్,ఏప్రిల్22 తరంగాలు ప్రతినిధి: చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

గురువారం, 23 ఏప్రిల్, 2026



# తమిళనాడులో నేడు ఒకే విడతలో పోలింగ్

జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమాస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. కొత్తగా సినీనటుడు విజయ్ టివికె పార్టీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్టాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతాని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసీజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయింది.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజ్ దగ్గరకు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయాంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. వ్యవస్థలపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదిక బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీల ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్‌ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై అసెంబ్లీలో తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్లు నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు పిల్లర్లు కాదని.. మొత్తం ఫౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీలు పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలోని పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

ములుగు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షం

హైదరాబాద్,ఏప్రిల్ 22 తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు , వడగళ్ల వాన తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా తెలంగాణలోని ములుగు, ఏపీలోని నంద్యాల జిల్లాలో కురిసిన వానకు సామాన్య ప్రజలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో భారీగా వడగళ్ల వాన కురిసింది. గాలుల ధాటికి పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఏటూరునాగారం – కమలాపూర్ మార్గంలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికి వచ్చే దశలో ఉన్న మిర్చి, వరి పంటలు వడగళ్ల వానకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

➢ మొదటి పేజి తరువాయి

దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్

ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷-లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷-లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు

నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# సింగపూర్‌తో రెండోరోజు మంత్రుల పర్యటన

**సింగపూర్ అభివృద్ధి ప్రణాళికపై అధ్యయనం**

అమరావతి, ఏప్రిల్ 22 ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్‌లో రెండో రోజు పర్యటన ముగిసింది. ఈ పర్యటనలో మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ ఉన్నారు. బుధవారం ఉదయం సింగపూర్ హోంమంత్రి షణ్ముగంతో మంత్రులు సమావేశం అయ్యారు. నేషన్ ఫస్ట్ గవర్నెన్స్, రాజకీయ జవాబుదారీ తనంపై శిక్షణ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. సమర్థవంతమైన నాయకత్వం అందించడం, ప్రభుత్వ యంత్రాంగం అంతా కలిసి సమన్వయంతో పనిచేసే విధానం వంటి అంశాలపై మంత్రులు చర్చించారు. మధ్యాహ్నం సింగపూర్ సిటీ గ్యాలరీని మంత్రులు సందర్శించారు. గడిచిన 50 ఏళ్లలో సింగపూర్ అభివృద్ధి చెందిన విధానం, భవిష్యత్తు ప్రణాళికలతో ఉన్న గ్యాలరీని సందర్శించారు.సింగపూర్ కో ఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ ఆధ్వర్యంలో గవర్నెన్స్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంపై శిక్షణ పొందారు. సింగపూర్ ప్రధాని స్టాటజ్రీ గ్రూప్‌లో భాగంగా ఉన్న సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ ఫ్యూచర్స్ సంస్థను మంత్రులు సందర్శించారు. నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ సిటీస్‌ను సందర్శించారు. సింగపూర్‌లో ఆధునిక నగరాల అభివృద్ధి, భవిష్యత్తు సవాళ్లపై సింగపూర్ సిటీస్ పనిచేస్తోంది. దీర్ఘకాలిక పట్టణ ప్రణాళిక, భూ వినియోగ పాలన, ప్రభుత్వ శాఖలు - సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై సింగపూర్ ప్రతినిధులు వివరించారు.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

➢ మొదటి పేజి తరువాయి

పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

హైదరాబాద్,ఏప్రిల్22 తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో

సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 23 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## రాఘుబోయిన గూడెంలో ఇటుక బట్టీల దందా

- శిఖం భూముల్లో ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల ఏర్పాటు
- వాయు కాలుష్యంతో నరకం చూస్తున్న ప్రజలు
- నిబంధనలు లేని బట్టీలను తక్షణమే సీజ్ చేయాలంటూ డిమాండ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 22, ( తరంగాలు):** ఇల్లందు మండలం రాఘుబోయిన గూడెం పంచాయితీ పరిధిలో గల, చెరువు శిఖం భూముల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు ప్రక్కన ఇటుక బట్టీల ఏర్పాటు చేయడంతో సమీప గ్రామాల ప్రజలు వాయుకాలుష్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇటుక బట్టిల నిర్వహణకు స్థానిక పంచాయతీ అనుమతులు అలాగే భూగర్భగనులు, రెవిన్యూ, నీటిపారుదల, పంచాయితీరాజ్, అటవీ కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ నుంచి అనుమతులు తప్పకుండా తీసుకోవాలి కానీ అదేమీ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి, లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహించారు. రహదారి పక్కనే ఇటుక బట్టీలు ఉండడంతో వాటికి వినియోగించే బూడిద,బొగ్గు,ఊక, కలప పదార్థాల నుండి వెలువడే కాలుష్యం తో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటికబట్టిలపై తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరారు.

## ఎండల తీవ్రతపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

•కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు కల్తీ పద్మ



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 22, ( తరంగాలు):** రోజురోజుకు ఎండలు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు కల్తి పద్మ సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున అవసరమైతే తప్ప బయటకు వెళ్ళరాదని, అత్యవసరం అనుకుంటే గొడుగు వినియోగించి ఎండ నుండి కాపాడుకోవాలని సూచించారు. శరీరంలో నీరసం రాకుండా ఉండేందుకు తరచూ ద్రవపదార్థాలు తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. మజ్జిగ, గ్లూకోజ్,నీరు, ఓ ఆర్ ఎస్ ద్రావణం వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుకోవచ్చున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే బాధితుని చల్లటి ప్రదేశానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి. భాస్కరరావు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం** : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు పత్రిక సమావేశంలో మాట్లాడుతూ...గత ప్రభుత్వం 2019లో ఆర్టీసీ కార్మికులు సమ్మెలో దిగినప్పుడు ఆర్టీసీని ప్రభుత్వ పరం చేయడం ఈ భూ ప్రపంచం ఉన్నంతవరకు జరగదని, యూనియన్లు రద్దు చేసి, నిర్లక్ష్యంగా కేసీఆర్, చేసిన వ్యాఖ్యలకు 53 రోజులుగా సమ్మె జరిగిందని తాత్కాలిక డ్రైవర్లను నియమకంతో అనేక ప్రమాదాలు జరిగాయని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ కార్మికులకు ఎన్నికలహామీ నెరవేర్చలేదని ఇకనైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని అంతేకాక రెండు పి.ఆర్.సి బకాయిలు విడుదల చేయాలన్నారు. ధనిక రాష్ట్రం అయిన తెలంగాణ ఆర్టీసీ కార్మికులపై చిన్న చూపు ఎందుకనీ పక్క రాష్ట్రం ఏపీలో చంద్రబాబు ఎన్నికల హామీ ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వ పరం చేశారని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పెట్టి ఆర్టీసీ కండక్టర్ లు మహిళా కండక్టర్లకు డ్రైవర్లకు పనిభారం పెరిగిందని బస్సులో ప్రయాణికులు అధికమైనా 42 డిగ్రీల ఎండలో హైదరాబాదు లాంటి దూర ప్రాంతాలకు ఫ్రీ బస్సులో 8 గంటలు చేయాల్సిన పని 13 గంటలు చేస్తున్నప్పటికీ వారి శ్రమని గుర్తించకుండా సమ్మె నోటీసు ముందుగానే ఇచ్చినప్పటికీ సమ్మెలో దింపటం రేవంత్ రెడ్డి ప్రభుత్వం దురదృష్టకరమని అన్నారు, ఆర్టీసీ యూనియన్లను రద్దు చేసిన కేసీఆర్ పరిస్థితి ఏమైందో మీకు తెలుసు. మీరు అదే తప్పు చేయకుండా ఆర్టీసీలో మళ్ళీ యూనియన్ల ను పునరుద్ధరింపజేయాల ని, వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని ఆర్టీసీ కార్మిక ఉద్యోగుల న్యాయమైన కోరికలను 24 గంటల్లో పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని లేనిపక్షంలో టీడీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాలతో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని టిఎన్టియుసి తరపున ఆర్టీసీ కార్మిక ఉద్యోగుల సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, నరసింహారావు, గంగవరపు అనంత కుమార్, మద్దినేని శ్రీనివాస్, తన్నీరు ప్రవీణ్, పొదిలి శ్రీను, షేక్ చాంద్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు డిపో లో ఆర్టీసీ జేఏసి సమ్మె సక్సెస్






**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 22, ( తరంగాలు):** స్థానిక ఇల్లందు ఆర్టీసీ కార్మికులు బస్ డిపో వద్ద మోహరించి సమ్మె విజయ వంతం చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు సి.ఐ భారీ బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ జేఏసి సమ్మె నేపథ్యంలో టెంట్ వేసి సమ్మె ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జరిగిన సభలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టో హామీ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,యూనియన్లను పునరుద్ధరించాలని, యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, పీ ఆర్సీ 2021,2025 చెల్లించాలని,2017 వేతన సవరణ ఏరియర్స్ చెల్లించాలని, ఎలక్ట్రిక్ బుద్దులు ఆర్టీసీ కి ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో తల పెట్టిన జే ఏ సీ సమ్మె కు స్టాఫ్ అండ్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు సంపూర్ణంగా మద్దతు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఐ వీలు జే ఏ సీ కన్వీనర్ ఖలీల్ పాషా , కో కన్వీనర్ డీ అంజయ్య, పీ.ఎల్ రావు, పీ.కృష్ణ, సైదమ్మ, ఉపేంద్ర,హనుమ,మహేశ్వరి,తాళ్లూరి కృష్ణ,మోహన్ రావు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇచ్చిన మాట తప్పని రాంపూర్ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్





**కల్వకుర్తి ఏప్రిల్ 22 తరంగాలు ప్రతినిధి**
తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామం లో గ్రామపంచాయతీ ఎన్నికలలో మెనుపెస్టులో భాగంగాఇచ్చిన మాట ప్రకారంగా రెండవపథకంఆడపడుచుపెళ్లికానుక10000పదివేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చిన రాంపూర్ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ ఆ మాట ప్రకారం ఈరోజు రాంపూర్ గ్రామంలోని 3వ వార్డు సభ్యులు దొరిబాయి లాలమ్మ-జంగయ్య ఏకైక కూతురు నందిని పెళ్లికి కానుకగా 10000 పదివేల రూపాయలు రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెలనిర్మల-శ్రీశైలం(వి.ఎన్.ఎస్.)యాదవ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామ ప్రజలు మాట్లాడుతూ డబ్బులు అందరి వద్ద ఉంటాయని దానం చేసే గుణం కొందరి దగ్గరనే ఉంటుందని అలాంటి గుణం ఉన్న గొప్ప వ్యక్తి రాంపూర్ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ అని రాంపూర్ గ్రామంలో నలుగురికిఆదర్శంగానిలుస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు ముదిరాజ్, మాజీ సర్పంచ్ మణెమ్మ-యాదయ్య,మాజీ ఎంపిటిసిభీమమ్మ-యాదయ్య, మాజీ టెంపుల్ చైర్మన్ సప్పిడీ జానయ్య, వార్డు సభ్యులు కాకి రాము, మాజీ వార్డు సభ్యులు:మీసాలఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకులు: టీచర్ రాములు, మీసాల అంజయ్య,విజయ్ కుమార్.యాదయ్య,శేఖర్,రొయ్యలమహేష్,శ్రీశైలం,మహేష్ యాదవ్, చిన్నయ్య,సప్పిడి మహేష్, శేఖర్, శివ, రాంపూర్ గ్రామప్రజలుతదితరులుపాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు



- ప్రజల శ్రేయస్సే లక్ష్యం -- ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి
- వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 22**

రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలిఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ గది ప్రారంభించి, చైర్‌పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు . ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ , మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేసి వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి

- అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి
- గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి
- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 22**

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంటలో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారుఅనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని విడిచిపెట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటివరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు.యతలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

యతలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు అందకపోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు .నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్‌లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు.పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు.సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్ట్‌ను నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,ఉభయ జిల్లాల ఇంజనీరింగ్ ఇరిగేషన్ పోలీస్ ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ జఫర్గడ్ పలు అభివృద్ధి కార్యక్రమాలు




**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 22,(తరంగాలు):** మండలం లోని తిమ్మాపురం స్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రపంచ భూ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థులకు ఇంకుడు గుంత ఇంటింటికి ఏర్పాటు చేసుకునేలా గ్రామ ప్రజలకు లైన్స్ క్లబ్ ద్వారా ఇంకుడు గుంతలు ఏ విధంగా నిర్మించుకోవాలి కరపత్రాలు పిల్లలకు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగింది అని అన్నారు.లయన్స్ క్లబ్ ఎలెక్టెడ్ ఫస్ట్ గవర్నర్ పుట్ట హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ చెట్లు నాటే కార్యక్రమం లో భాగంగా మొక్కలు వితరణ చేయడం జరిగింది. జఫర్గడ్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడాల పూర్ణచందర్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు తిమ్మాపురం గ్రామ వార్డు మెంబర్ విద్యార్థులకు నోట్ బుక్స్ కోడి మాల సురేష్ సహాయంతో విద్యార్థులకు నోటు బుక్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పేర్కొన్నారు. అదేవిధంగా జఫర్గడ్ లో అలియాబాద్ శివారులో ప్రభుత్వం నడిపిస్తున్న ఐకెపి సెంటర్ వద్ద లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్ష కార్యదర్శుల, సభ్యుల సహాయంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తార, ఎం రేణుక, రజిత, పాల్గొన్నారు కార్యక్రమంలో హిమ్మత్ నగర్ హై స్కూల్ హెడ్మాస్టర్ లయన్ మంగు జయప్రకాష్ స్కూల్ హెడ్ మాస్టర్ రమణ,టీచర్ జ్యోతి, క్లబ్ సెక్రటరీ లయన్ అంచూర యుగేందర్,ంక్లబ్బు ప్రతినిధులు లయన్ ఎర్ర నరేష్, లయన్ మాద శ్రీధర్ , పి ఆర్ ఓ బోనగిరి శ్రవణ్ కుమార్, గ్రామస్తులు ప్రజలు

## ఇంటర్ పాసైన గిరిజనులకు శుభవార్త భద్రాచలంలో డి.ఎల్.ఎడ్ అడ్మిషన్లు

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి .రాహుల్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 22**

2026-28 విద్యా సంవత్సరమునకు గాను రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమార్థం భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన డి. ఎల్. ఈ డి కళాశాలలో తెలుగు మీడియం (12 బ్యాచ్) రెగ్యులర్ డి. ఎల్. ఇ డి కోర్సులో ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన అభ్యర్థుల నుండి నేరుగా దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాలలో మొత్తం 50 సీట్లు కలవని, కళాశాలలో ప్రవేశానికి అర్హతలు తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన అభ్యర్థులై ఉండవలెనని, మే/జూన్ 2026 కానీ అంతకు ముందు కానీ ఇంటర్మీడియట్ పాసై కనీసం 45 శాతం మార్కులు సాధించి ఉండాలని, సంబంధిత ఇంటర్మీడియట్ పరీక్షలో సాధించిన మెరిట్ ని బట్టి ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారము మహిళలకు ప్రత్యేక కేటగిరి వారికే సీట్లు రిజర్వు చేయబడ్డాయని, ప్రభుత్వ ఉత్తర్వులు నెంబర్ 01. తేదీ 04-08-2014, నెంబర్ 63. తేదీ 28-10-2013, నెంబర్ 22. తేదీ 29-05-2014 మరియు నెంబర్ 10. తేదీ 12-04-2017 ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కళాశాలలో ప్రవేశానికి ప్రాస్పెక్టస్ మరియు దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయని, ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడిఏ కార్యాలయంలలోను మరియు గిరిజన డి ఎల్ ఈ డి కళాశాల భద్రాచలం నందు ప్రోస్పెక్టరేస్ మరియు దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చునని ఆయన అన్నారు. దరఖాస్తు పోస్టు ద్వారా పొందగోరు అభ్యర్థులు తమ సొంత అడ్రస్ గల కవర్ (రు.10/-స్టాంపుతో)ను ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలంకు పంపి పొందవచ్చునని, దరఖాస్తు మరియు ప్రాస్పెక్టస్ క్షుణ్ణంగా చదివి దరఖాస్తుని సక్రమంగా పూర్తి చేసి వచ్చేనెల 11 వ తారీకు వరకు సమర్పించాలని ఆయన కోరుతూ అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరించబడునని అన్నారు మరిన్ని వివరాలకు 9959575539, 8639084543, 8309972776 ఫోన్ నెంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు

## మనాలి ఎన్.సి.సి క్యాంప్ కి ఎంపికైన దరిపల్లి విద్యార్థి - ఘనంగా వీడ్కోలు




**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 22, ( తరంగాలు):** దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్, బీటెక్ ఇంజనీరింగ్, ఎంబీఏ) కళాశాలలో ఎన్.సి.సి విభాగానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి వరుణ్ త్రిలోక్ నేషనల్ ట్రెక్కింగ్ క్యాంప్ (మనాలి) కు ఎంపిక కావడంతో కళాశాల యాజమాన్యం, ఎన్.సి.సి అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత, కళాశాల ప్రిన్సిపల్ డా. దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ, 10 రోజుల పాటు జరిగే ట్రైనింగ్ కోసం 11(టి) బెటాలియన్ ఖమ్మం నుంచి సెలెక్ట్ అయిన ఐదుగురిలో ఒకరు దరిపల్లి విద్యార్థి కావటం కళాశాలకి గర్వ కారణం అని, తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో నిలుస్తుండడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎన్.సి.సి క్యాంపులు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి, అకాడమిక్ ఇన్చార్జ్ చైతన్య, ఎన్.సి.సి కేర్ టేకర్, ఏవో చిరంజీవి, వివిధ విభాగాల అధిపతులు ప్రవీణ్ కుమార్, మానస, సద్దాఫ్, శ్రీను, రవి కుమార్, శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది ప్రసన్నలక్ష్మి, రేహమతి, రామయ్య, కళాశాల మరియు ఎన్.సి.సి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వరుణ్ త్రిలోక్ విద్యార్థి నీ ఘనంగా సెండాఫ్ చేశారు.

## దరిపల్లిలో ఘనంగా ధరిత్రీ దినోత్సవం



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 22, (తరంగాలు):** దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్, బీటెక్ ఇంజనీరింగ్, ఎంబీఏ) కళాశాలలో "ధరిత్రీ దినోత్సవం ( ఎర్త్ డే)"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత, కళాశాల ప్రిన్సిపల్ డా. దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, మన భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం, అరణ్య వినాశనం, వాతావరణ మార్పులు వంటి సమస్యలు భవిష్యత్తు తరాలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ, శక్తి ఆదా వంటి చిన్నచిన్న చర్యల ద్వారా పెద్ద మార్పును తీసుకురాగలమని సూచించారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో పర్యావరణానికి హాని కలిగించని అలవాట్లను అలవరచుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రతి మొక్కను ఒక బాధ్యతగా తీసుకుని వాటిని సంరక్షించాలని, భవిష్యత్తులో ఇవే మనకు ఆక్సిజన్, నీడ, జీవనాధారంగా నిలుస్తాయని తెలియజేశారు. అదనంగా "గ్రీన్ క్యాంపస్" లక్ష్యంతో కళాశాల ప్రాంగణాన్ని మరింత హరితంగా మార్చేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి, అకాడమిక్ ఇన్చార్జ్ చైతన్య, ఎన్.సి.సి కేర్ టేకర్, ఏవో చిరంజీవి, వివిధ విభాగాల అధిపతులు ప్రవీణ్ కుమార్, మానస, శ్రీను, రవి కుమార్, బోధనేతర సిబ్బంది ప్రసన్నలక్ష్మి, రేహమతి, రామయ్య, కళాశాల ఎన్.సి.సి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ధరిత్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## పదవి విరమణ



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 22,(తరంగాలు):**

పాలకుర్తి మండలం లోని విస్నూర్ గ్రామ జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జఫర్ గడ్ వాస్తవ్యులు చిలుకమారి వెంకట చారి పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి వీడుకోలు అభినందనలు తెలియజేసిన స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయునికి పదవి విరమణ సహజం అని తెలిపారు.గత కొన్ని సంవత్సరాల నుండి ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పి వారు ఉన్నతమైన స్థానంలో ఉండేలా కృషి చేసారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జఫర్ గడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పై ఖమ్మం కాంగ్రెస్ ఫైర్

• నేతలపై దీపక్ చౌదరి ఘాటు విమర్శలు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు దీపక్ చౌదరి టీఆర్ఎస్ నాయకులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.టీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ పేరిట వేదిక పెట్టుకుని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవి చంద్ర , జిల్లా అధ్యక్షుడు తాతా మధు కలిసి ఖమ్మం అభివృద్ధి ప్రదాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ఆరోపణలు చేయడం వారి రాజకీయ దివాళా తీయబడిన దుస్థితికి నిదర్శనమని అన్నారు. అభివృద్ధి చూడలేక అసూయతో విమర్శలు"కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ఖమ్మం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వరద పారిస్తుంటే, దాన్ని జీర్ణించుకోలేక టీఆర్ఎస్ నేతలు తుమ్మల పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అవకాశవాది ఎవరో ఖమ్మం ప్రజలకు బాగా తెలుసుతుమ్మల ని అవకాశవాదిగా విమర్శిస్తున్న పువ్వాడ అజయ్ కుమార్ కాంగ్రెస్ నుండి గెలిచి పార్టీ ఫిరాయించిన తొలి ఎమ్మెల్యేఅధికారాల కోసం పార్టీలు మారిన అసలు అవకాశవాదిఅంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. మీ అరాచక పాలననే మీ ఓటమికి కారణంమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన కబ్జాలు, దందాలు, ప్రజలకు రక్షణ లేకుండా చేసిన పాలన కారణంగానే ప్రజలు అజయ్ కుమార్ ని గట్టిగా తిరస్కరించారని స్పష్టం చేశారు. తుమ్మలంటే అభివృద్ధి టిఆర్ఎస్ కి భయంరాష్ట్ర విభజన సమయంలో టీఆర్ఎస్ నాయకులే తుమ్మల నాగేశ్వరరావు ని బ్రతిమిలాడి పార్టీలోకి తీసుకున్నారని,2023లో ప్రజల కోరిక మేరకు ఖమ్మం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని తెలిపారు. తుమ్మల ఉంటే ఖమ్మం అభివృద్ధి లేకుంటే అవినీతి పాలన" అని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. టిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి డ్రామాలు ఆడుతున్నారు"ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీఆర్ఎస్ నేతలు మళ్లీ ప్రాధాన్యం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ , కార్పొరేటర్లు, డీసీసీ నాయకులు పాల్గొన్నారు.

## పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది



- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి
- విద్యాశాఖలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సుదీర్ఘంగా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.22, తరంగాలు:** పట్టణాలు , గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని, గ్రామాలు పట్టణాలలో ప్రజలు తమ యొక్క ఇంటి పన్ను నల్ల పన్ను బాధ్యతాయుతంగా చెల్లించి గ్రామాలు పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, విద్యాశాఖలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, వైస్ చైర్పర్సన్ అల్లం రమ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్, హెల్త్, శానిటేషన్, విద్యాశాఖ సిబ్బందితో పెండింగ్ పనులు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతోపాటు ప్రజల సహకారంతో పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్, లే అవుట్ అనుమతుల ద్వారా నిధులు సేకరించాలని, పన్నుల వసూళ్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, బల్క్ ఎస్ఎంఎస్ ల ద్వారా ప్రజలకు తెలియపరచాలని, సూచించారు. మున్సిపల్ పరిధిలో నిత్యం సానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని దశలవారీగా సిబ్బందిని కేటాయించాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, యూనిఫామ్స్ ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు, బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు.ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ ద్వారా అందించే వాటర్ సప్లై నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం ఉన్నచోట టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పనిచేసి పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరం ఉన్నచోట ఆటోలు ట్రాక్టర్స్ ఇతర వాహనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు, కేసముద్రం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు,మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్ చైర్పర్సన్లు పట్టణాల అభివృద్ధి కోసం పలు సూచనలు సలహాలు అందించారు,అంతర్గత రోడ్ల నిర్మాణం అభివృద్ధి పనులు పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు,ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కలిసి పనిచేసి పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు,విద్యాశాఖ లోని సుమారు (839) పాఠశాలలలో వివిధ అభివృద్ధి పనులు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, త్రాగునీరు సరఫరా సిస్టం, మైనర్ రిపేర్, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు అయిన పనులు కొన్ని పెండింగ్లో ఉన్నందున అట్టి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సంస్థ, ఈ డబ్ల్యూ ఐ సి, అధికారులు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహబూబాబాద్ ఇంచార్జ్ కమిషనర్ ఉపేందర్, టిపిఓ సాయి రామ్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ ఇంజినీరింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి

•మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 22, ( తరంగాలు):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్పర్సన్ గది ప్రారంభించి, చైర్పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు . ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, 22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్,మున్సిపల్ కమిషనర్ గణేష్, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలి





**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు**

**కేసముద్రం,మహబూబాబాద్జిల్లా,పతినిధి,ఏప్రిల్.22,తరంగాలు:** బుధవారంకేసముద్రం మున్సిపాలిటీ 13వ వార్డు పరిధిలో అంగన్వాడి స్కూల్లో ఘనంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, ముఖ్య అతిథిగా హాజరై గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయాలు,విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు

## వసతి గృహాల పనితీరును మెరుగుపరచడంలో, విద్యా ప్రమాణాలను పెంచడంలో అధికారులు శ్రద్ధ వహించాలి



•స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 22, తరంగాలు:** 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం కేసముద్రం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మండలంలోని టీజీ టీ డబ్ల్యూ యు ఆర్ జె సి (బాలికల) కళాశాల, కేజీబీవీ మహమూద్‌పట్నం అదనపు కలెక్టర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత మరియు విద్యా బోధనను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, రికార్డులు మరియు హాజరును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాస్టళ్లలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం మరియు విద్యుత్ సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల పనితీరును మెరుగుపరచడంలో, విద్యా ప్రమాణాలను పెంచడం అధికారుల యొక్క కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఎంపీడీవో జే.క్రాంతి,పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 23 ఏప్రిల్, 2026



## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

• కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ ప్రతినిధి,22 ఏప్రిల్, తరంగాలు : భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు.

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన "ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15--30)" పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూ కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్నమదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !



హైదరాబాద్,ఏప్రిల్22 టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు.. 1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడు తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పొరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి






**రాయపర్తి, ఏప్రిల్ 22,తరంగాలు** :బాధిత కుటుంబాలను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి,ఆర్థిక సహాయం చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలయాపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాజు సోమయ్య, గజావెల్లి మల్లికాంబ, గూడూరు బాలరాజు ఇటీవల వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కో కుటుంబనికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, దేవరుప్పుల మండల పార్టీ నాయకులు ఏలే సుందర్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, బొమ్మినేని సురేందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి,స్థానిక నాయకులు అయిన గ్రామ పార్టీ అధ్యక్షులు దోకుడు దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ గుడి యుగేందర్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు లిమైబు రెడ్డి, వశపాక మారయ్య, చిన్న యాకయ్య, గట్టు, గజావెల్లి రాజు, వశపాక విజయ్,తదితరులు పాల్గొన్నారు.



## హీట్ వేవ్ ముప్పుకు ముందస్తు చర్యలకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద






వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 22,తరంగాలు : జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సంబంధిత మున్సిపల్, ఇరిగేషన్ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో షెడ్‌లు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, వడ దెబ్బ కేసులకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, అగ్నిమాపక, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ, మునిసిపల్, గ్రామీణ అభివృద్ధి, విద్య, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వేడి తీవ్రత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, కార్మికులు జాగ్రత్తగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్వో విజయ లక్ష్మీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్లు మాన్యువల్ కూపన్ల ద్వారా ఇసుక అనుమతులు ఇవ్వొద్దు

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**






వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 22,తరంగాలు : తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సూచనల మేరకు తహసీల్దార్లు మాన్యువల్ కూపన్ల ద్వారా ఇసుక అనుమతులు ఇవ్వరాదని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఇసుక సరఫరాపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేని కారణంగా పక్క జిల్లాల సాండ్ యార్డుల నుంచి టీజీఎమ్ఐవి పోర్టల్ ద్వారా "మన ఇసుక వాహనం" సేవతో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు టన్నుకు రూ. 900, వాణిజ్య అవసరాలకు రూ. 1300 చెల్లించి ఇసుక పొందవచ్చన్నారు. వర్ధన్నపేట్ మండలం కట్రీయాల గ్రామంలో సాండ్ బజార్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అతను కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, ఎడి మైన్స్ రవి శంకర్, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, మరియు సంబంధిత మండలాల తాసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి చికిత్సలో పోషకాహారం కూడా చాలా కీలకం.. WHO వెల్లడి..



టెక్నాలజీ, వైద్యం, విజ్ఞాన రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వస్తున్నా క్షయవ్యాధి ఇప్పటికీ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన సంక్రమణ వ్యాధుల్లో ఒకటిగా మారింది. చికిత్సలో పురోగతి ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది, ముఖ్యంగా పేదరికంలో జీవిస్తున్నవారు లేదా సరైన వైద్య సదుపాయాలు లేని వారు ఇంకా ఈ వ్యాధితో బాధపడుతున్నారు. క్షయవ్యాధి నుంచి కోలుకోవడానికి మందులు మాత్రమే సరిపోవని, సరైన పోషకాహారం కూడా అంతే కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ WHO మార్గదర్శకాల ప్రకారం తక్కువ పోషకాహారం క్షయవ్యాధి తీవ్రతను పెంచే ప్రధాన కారణంగా మారింది. ఇది రోగనిరోధక శక్తిని బలహీనపరచి వ్యాధి తీవ్రత, మళ్లీ రావడం , మరణాల రేటును పెంచుతుందని తేలింది. అందువల్ల TB రోగులకు మాత్రమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు కూడా పోషకాహార మూల్యాంకనం, సలహాలు, ఆహార మద్దతు తప్పనిసరి చేయాలని WHO సూచిస్తోంది. వైద్య అధ్యయనాలు కూడా ఈ మార్పును సూచిస్తున్నాయి.

### ప్రోటీన్లను అధికంగా తీసుకోవాలి..

పోషకాహారం తక్కువగా తీసుకునే రోగులు నెమ్మదిగా కోలుకుంటారు, ఫలితాలు కూడా తక్కువగా ఉంటాయి. చికిత్స ప్రారంభ దశలో బరువు పెరగడం, మరణ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. క్షయవ్యాధి రోగుల ఆహారంలో ముఖ్యంగా అధిక కాలరీలు, అధిక ప్రోటీన్ ఉండాలి. ఈ వ్యాధి శరీరంపై ఒత్తిడిని పెంచి, ఆకలిని తగ్గిస్తుంది. అందువల్ల శరీర బలాన్ని తిరిగి పొందడానికి, కండరాలను పునర్నిర్మించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి పోషకాహారం అవసరం. మిల్లెట్లు, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటి సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గుడ్లు, చికెన్, చేపలు, పాలు, పెరుగు, పనీర్ వంటి పదార్థాలు ఆహారంలో ఉండాలి. అలాగే సూక్ష్మ పోషకాలుకూడా ముఖ్యమే. విటమిన్లు, ఖనిజాలు తక్కువ పరిమాణంలో అవసరమైనప్పటికీ, శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి.

### ప్రో బయోటిక్స్ కీలకం..

ఆకుకూరలు, క్యారెట్, టమాటా, సిట్రస్ పండ్లు, నట్స్, గింజలు, ఫోర్టిఫైడ్ సిరియల్స్ వంటి పదార్థాలు రోజువారీ ఆహారంలో ఉండటం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా కోలుకోవడంలో సహాయపడతాయి. చాలా మంది TB రోగులకు ఆకలి తగ్గడం, బరువు తగ్గడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అవకాడో, నట్స్, నట్ బటర్స్, ఆలివ్ ఆయిల్, సర్సన్ (మస్టర్డ్) ఆయిల్ వంటి మంచి కొవ్వులు శక్తిని అందిస్తాయి. ఇక హైడ్రేషన్ కూడా చాలా ముఖ్యం. సరిపడా నీరు తాగడం ద్వారా శరీరం మందులను సరిగ్గా గ్రహిస్తుంది, మెటబాలిజం మెరుగుపడుతుంది, జీర్ణక్రియ సులభమవుతుంది. నీరు, కొబ్బరి నీరు, సూప్స్, పెరుగు వంటి ప్రోబయోటిక్ ఆహారాలు గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యాన్ని కాపాడతాయి. అలాగే కొన్ని ఆహారాలను పరిమితం చేయడం అవసరం. ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక కెఫీన్, చక్కెర పదార్థాలు, మద్యం వంటివి రోగనిరోధక శక్తిని తగ్గించి, మందుల ప్రభావాన్ని కూడా దెబ్బతీస్తాయి. ముఖ్యంగా మద్యం లివర్‌పై ప్రతికూల ప్రభావం చూపి చికిత్సను కష్టతరం చేస్తుంది. తాజా WHO విధాన మార్పులు క్షయవ్యాధి చికిత్సలో పోషకాహారాన్ని ప్రధాన భాగంగా గుర్తిస్తున్నాయి. RATIONS ట్రయల్ వంటి అధ్యయనాలు కూడా రోగులకు, వారి కుటుంబాలకు ఆహారం అందించడం ద్వారా కొత్త ఇన్ఫెక్షన్లు తగ్గి, జీవన రేటు పెరిగిందని వెల్లడించాయి. సరైన అవగాహన, పోషకాహారం, వైద్య చికిత్స వంటివన్నీ కలిసి పనిచేస్తే, క్షయవ్యాధి రహిత ప్రపంచం లక్ష్యం సాధ్యమవుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

## ఫ్యాటీ లివర్‌కు చెక్ పెట్టే సహజ ఆహారాలు




కాలేయం మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఉన్న విష పదార్థాల ను తొలగించడం, రక్తాన్ని శుభ్రపరచడం, శక్తిని నిల్వ చేయడం వంటి అనేక ముఖ్యమైన పనులు చేస్తుంది. కానీ నేటి అనారోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కాలేయ ఆరోగ్యాన్ని కాపాడే ముఖ్యమైన ఆహారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం..

ఆకుకూరలు: పాలకూర, ఇతర ఆకుకూరలు కాలేయానికి మంచివి. ఇవి శరీరంలో ఉన్న విషాలను తొలగించడంలో సహాయపడతాయి.

వెల్లుల్లి: ఇందులో ఉన్న సహజ పదార్థాలు కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడతాయి.

సిట్రస్ పండ్లు : నిమ్మ, నారింజ, ఉసిరి వంటివి విటమిన్ జ కలిగి ఉండి కాలేయాన్ని శుభ్రంగా ఉంచుతాయి.

పసుపు: వాపును తగ్గించి కాలేయ కణాలను రక్షిస్తుంది.

బీట్‌రూట్ రసం: కాలేయాన్ని శుభ్రపరచడంలో, వాపు తగ్గించడంలో సహాయపడుతుంది.

టమాటా: కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది.

గ్రీన్ టీ: కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది.

దానిమ్మ: కాలేయ కణాలను రక్షించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

### ముఖ్య సూచనలు

వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. రోజూ వ్యాయామం చేయడం, సరైన నిద్ర తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి జీవనశైలి పాటిస్తే కాలేయాన్ని దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# ఏబీసీ జ్యూస్, గ్రీన్ జ్యూస్.. అంటే ఏమిటి.. ఇవి శరీరానికి ఏవిధంగా మేలు చేస్తాయి..?



వేసవి కాలంలో జ్యూసింగ్ ఒక ట్రెండ్ మాత్రమే కాకుండా ఇప్పుడు అనేక మందికి తప్పనిసరి అలవాటుగా మారింది. ఎర్రటి రంగులో కనిపించే ఏబీసీ (ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్) జ్యూస్ అయినా, గాఢమైన ఆకుపచ్చ రంగులో ఉండే గ్రీన్ జ్యూస్ అయినా.. రెండూ జీర్ణక్రియకు మంచివని భావిస్తారు. అయితే ఈ జ్యూసులు నిజంగా గట్ మైక్రోబయోమ్ (జీర్ణ వ్యవస్థలోని మంచి బ్యాక్టీరియా)కు ఎంతవరకు ఉపయోగపడతాయి? ప్రస్తుతం నగర జీవనశైలిలో పెరుగుతున్న జీర్ణ సమస్యలు, బ్లోటింగ్ (కడుపు ఉబ్బరం) నుంచి ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ వరకు ఈ రెండు జ్యూసుల మధ్య ఉన్న తేడాలను అర్థం చేసుకోవడం అవసరమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మొదటగా ఏబీసీ జ్యూస్ అంటే ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్ కలయిక. ఇది ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని ప్రచారం పొందింది. మరోవైపు గ్రీన్ జ్యూస్ అనేది పాలకూర, కేల్, దోసకాయ, సెలరీ వంటి ఆకుకూరలతో తయారవుతుంది. దీనిలో కొద్దిగా నిమ్మరసం లేదా అల్లం కూడా కలుపుతారు.

### రక్త ప్రసరణ మెరుగుదలకు..

ఒకటి భూమిలో పెరిగే వేరుజాతి పదార్థాలపై ఆధారపడితే, మరొకటి ఆకుకూరలలోని క్లోరోఫిల్, నీటి శాతం ఎక్కువగా ఉండే పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. ఏబీసీ జ్యూస్ గట్ ఆరోగ్యానికి ప్రీ-బయోటిక్ శక్తిగా పనిచేస్తుంది. ఆపిల్‌లో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. బీట్‌రూట్‌లోని బెటలైన్స్ యాంటీ ఆక్సిడెంట్స్‌గా పనిచేసి రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి, తద్వారా జీర్ణ వ్యవస్థకు ఆక్సిజన్ సరఫరా బాగుంటుంది. క్యారెట్‌లోని బీటా కెరోటిన్ విటమిన్‌ఏ గా మారి జీర్ణాశయంలోని పొరను రక్షిస్తుంది. ఈ కారణంగా ాాదీజ జ్యూస్ నెమ్మదిగా జీర్ణమయ్యే వారికి, తక్కువ ఎనర్జీ ఉన్న వారికి, లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారికి ఉపయోగపడుతుంది.

### జీర్ణ సమస్యలు తగ్గేందుకు..

ఇక గ్రీన్ జ్యూస్ ప్రధానంగా శరీరాన్ని చల్లబరచే, ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గించే లక్షణాలతో ఉంటుంది. ఆకుకూరలలోని క్లోరోఫిల్ శరీరంలో టాక్సిన్స్‌ను తగ్గించి ఆల్కలైన్ బ్యాలెన్స్‌ను మెరుగుపరుస్తుంది. పాలకూరలో ఉండే మెగ్నీషియం కండరాలను రిలాక్స్ చేసి పొట్ట కండరాల నొప్పులను తగ్గిస్తుంది. దోసకాయ, సెలరీ వంటి పదార్థాలు శరీరానికి ఎలక్ట్రోలైట్స్ అందించి హైడ్రేషన్ పెంచుతాయి. అల్లం జీర్ణక్రియను వేగవంతం చేసి గ్యాస్, ఆసిడ్ రిఫ్లక్స్ సమస్యలను తగ్గిస్తుంది. గ్రీన్ జ్యూస్ ముఖ్యంగా బ్లోటింగ్, ఆసిడిటీ సమస్యలతో బాధపడేవారికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, జ్యూసింగ్‌లో ఒక ముఖ్యమైన లోపం ఫైబర్ తగ్గిపోవడం. పండ్లు, కూరగాయలను జ్యూస్ చేస్తే వాటిలోని పల్ప్ తొలగిపోతుంది. ఇదే పల్ప్ గట్ ఆరోగ్యానికి కీలకం. ఫైబర్ లేకపోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు త్వరగా పెరుగుతాయి. దీని వల్ల గట్ బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే ఒక పండు కోసం మూడు కూరగాయల నిష్పత్తి పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

### దేన్ని తాగాలి..

ఇక ఏ జ్యూస్ మంచిదనే ప్రశ్నకు ఒకే సమాధానం లేదు. గట్ లైనింగ్‌ను బలపరచుకోవాలని అనుకుంటే ఏబీసీ జ్యూస్ ఉత్తమం. ఇన్‌ఫ్లమేషన్, బ్లోటింగ్ తగ్గించుకోవాలంటే గ్రీన్ జ్యూస్ మంచిది. రెండింటినీ విడతలవారీగా తీసుకోవడం ఉత్తమమైన పద్ధతి. ఉదాహరణకు, మూడు రోజులు ఏబీసీ జ్యూస్ తీసుకుని, తరువాత మూడు రోజులు గ్రీన్ జ్యూస్ తీసుకుంటే గట్ మైక్రోబయోమ్‌కు వైవిధ్యం లభిస్తుంది. అయితే ఇది సాధారణ ఆరోగ్యంతో ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నవారు తప్పనిసరిగా పోషకాహార నిపుణులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు.

# లోయర్ బ్యాక్ పెయిన్ అసలు ఎందుకు వస్తుంది.. దీని వెనుక కారణాలేమిటి..?



చాలా మంది జీవితంలో ఏదో ఒక సమయంలో దిగువ నడుము నొప్పి (లోయర్ బ్యాక్ పెయిన్) అనుభవిస్తారు. కొందరిలో ఇది తాత్కాలికంగా ఉండగా, మరికొందరిలో దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది. సాధారణంగా కండరాల ఒత్తిడి వల్ల ఈ నొప్పి వస్తుంది అనుకుంటారు. అయితే అసలు కారణం చాలా సందర్భాల్లో లోతుగా ఉంటుంది. కారణాన్ని సరిగ్గా గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుంది. దిగువ నడుము నొప్పికి ప్రధాన కారణాలలో ఒకటి డిస్క్ సమస్యలు. వెన్నెముకలోని వెర్టిబ్రాల మధ్య ఉన్న డిస్కులు షాక్ అబ్జార్బర్లలా పనిచేస్తాయి. కానీ ఇవి బల్జ్ కావడం, హెర్నియేట్ అవడం లేదా క్రమంగా దెబ్బతినడం వల్ల తీవ్రమైన నొప్పి వస్తుంది. హెర్నియేటెడ్ డిస్క్ ఉన్నప్పుడు నాడులపై ఒత్తిడి పెరిగి కాళ్లకు వెళ్ళే నొప్పి (సైయాటికా) వస్తుంది. డిజెనరేటివ్ డిస్క్ డిసీజ్‌లో డిస్కులు పలుచగా మారి దీర్ఘకాలిక నొప్పికి దారితీస్తాయి.

### ఆస్టియోపోరోసిస్ ఉంటే..

మరొక ముఖ్య కారణం స్పైనల్ ఫ్రాక్చర్స్. వెన్నెముకలో చిన్న పగుళ్లు ఏర్పడితే తీవ్రమైన నొప్పి కలుగు తుంది. ఆస్టియోపోరోసిస్ ఉన్నవారిలో ఎముకలు బలహీనపడటం వల్ల చిన్న పనులతోనే ఫ్రాక్చర్స్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాగే ప్రమాదాలు లేదా పడిపోవడం వల్ల కూడా అకస్మాత్తుగా నొప్పి వస్తుంది. యువ క్రీడాకారుల్లో స్పాండిలోలైసిస్ అనే స్ట్రెస్ ఫ్రాక్చర్ కనిపిస్తుంది. వెన్నెముక నిర్మాణంలో మార్పులు కూడా నడుము నొప్పికి కారణం అవుతాయి. స్పైనల్ స్టెనోసిస్‌లో స్పైన్ కాలువ సన్నగా మారి నాడులపై ఒత్తిడి పెరుగుతుంది. స్పాండిలోలిస్తేసిస్‌లో వెర్టిబ్రాలు ముందుకు జరగడం వల్ల నొప్పి వస్తుంది. అలాగే స్కోలియోసిస్ వల్ల వెన్నెముక వంగి అసమాన నొప్పి కలుగుతుంది. ఇవి ఎక్కువగా తప్పుగా కూర్చునే అలవాట్లు, అధిక బరువు వల్ల మరింత పెరుగుతాయి.

### ఆర్థరైటిస్ ఉన్నవారిలో..

ఆర్థరైటిస్ కూడా ఒక ముఖ్య కారణం. ఆస్టియోఆర్థరైటిస్ వల్ల కార్టిలేజ్ దెబ్బతిని కఠినత్వం, నొప్పి పెరుగుతాయి. అంకిలోసింగ్ స్పాండిలైటిస్ అనే అరుదైన వ్యాధి యువకుల్లో మొదలై వెన్నెముక కఠినంగా మారే ప్రమాదం ఉంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు, ట్యూమర్లు కూడా నడుము నొప్పికి కారణమవుతాయి. ఆస్టియోమైలిటిస్ లేదా డిస్క్ ఇన్‌ఫెక్షన్లు ఎముకలను దెబ్బతీస్తాయి. అలాగే క్యాన్సర్ సంబంధిత ట్యూమర్లు వెన్నెముకపై ఒత్తిడి పెంచి రాత్రి సమయంలో ఎక్కువ నొప్పి కలిగిస్తాయి. ఇవి అత్యవసర వైద్య పరీక్షలు అవసరం చేసే పరిస్థితులు. అంతేకాకుండా కిడ్నీ స్టోన్స్ కూడా దిగువ నడుము నొప్పికి కారణం అవుతాయి. కిడ్నీ స్టోన్స్ ఉన్నప్పుడు నొప్పి నడుము నుండి పొత్తికడుపు లేదా తొడల వరకు వ్యాపిస్తుంది. దీనికి తోడు వాంతులు, మూత్రంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా అరుదుగా కానీ ప్రమాదకరమైన కారణం అబ్డామినల్ అవార్టిక్ అన్యూరిజం. ఇది పొత్తికడుపులోని ప్రధాన రక్తనాళం ఉబ్బిపోవడం వల్ల ఏర్పడుతుంది. ఇది పగిలితే ప్రాణాపాయం కలుగుతుంది, కాబట్టి వెంటనే చికిత్స అవసరం. దిగువ నడుము నొప్పి సాధారణ సమస్యగా కనిపించినా, దాని వెనుక అనేక కారణాలు ఉంటాయి. కాబట్టి నొప్పి ఎక్కువ రోజులు కొనసాగితే లేదా తీవ్రంగా ఉంటే, కారణాన్ని గుర్తించేందుకు వైద్యులను సంప్రదించడం అత్యవసరం.

## మళ్లీ పాత రోజుల్లోకి..

అంబలి, సద్దన్నం, మాల్ట్ డ్రింక్స్‌కు డిమాండ్




ఒకప్పుడు పల్లెల్లో చల్లటి మట్టి కుండలో దాచిన అంబలి, అవ్వ ప్రేమతో కలిపిన సద్దన్నం కేవలం ఆకలిని తీర్చడమే కాకుండా.. ప్రాణాలకు రక్షణనిచ్చే సంజీవనిలా ఉండేవి. నేడు జీవనశైలి మారడంతో అవే సంప్రదాయ ఆహారాలు సరికొత్త వ్యాపార రూపం దాల్చుతున్నాయి. ఆత్మీయంగా అందించే రాగి జావ, ఇప్పుడు రోడ్ల పక్కన స్టాళ్లలో గ్లాసుల్లో విక్రయించడం విశేషం. ప్రస్తుతం దుబ్బాకలో రాగి, కొర్రలు వంటి సిరిధాన్యాలతో తయారయ్యే పానీయాలకు విపరీతమైన గిరాకీ కనిపిస్తోంది.

గతంలో కరువు కాలంలో పేదల ఆకలి తీర్చిన అంబలి కేంద్రాలు నేడు "మిల్లెట్ డ్రింక్" కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. సిద్దిపేట, ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యమ కాలంలో అంబలి కేంద్రంలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా ఉండేది. వ్యవసాయ కూలీలకు, నిరుపేదలకు అంబలికేంద్రాల ద్వారా ఆకలి తీర్చేవారు. కమ్యూనిస్టు పార్టీలతోపాటు విప్లవ ఉద్యమపార్టీల అనుబంద సంస్థలు కూడా దశాబ్దకాలం పాటు అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి, నిరుపేదల ఆకలి తీర్చారు. ఒకప్పుడు కరువు కాలాల్లో అంబలి ప్రాణాధారం. తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి అందుబాటులో ఉండే ఈ పానీయం ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు మళ్లీ వాటికి విపరీతమైన గిరాకీ పెరగడం విశేషం.

### ఆరోగ్యంపై పెరిగిన అవగాహన

వేగవంతమైన జీవనశైలి వల్ల తలెత్తుతున్న మధుమేహం, బీపీ, ఊబకాయం వంటి సమస్యల నేపథ్యంలో ప్రజలు మళ్లీ పాత పద్ధతుల వైపు మళ్లుతున్నారు. సద్దన్నంలోని ప్రోబయోటిక్స్, రాగి జావలోని కాల్షియం, ఐరన్, కొర్రల జావలో ఉండే అధిక పీచు పదార్థం (ఫైబర్) ఆరోగ్యానికి రక్షణ కవచాలుగా మారుతున్నాయి. రాగి అంబలి నిజంగా ఒక సంపూర్ణ పౌష్టికాహారం. ఇందులో కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకల బలాన్ని పెంచుతుంది. ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.

### ఉపాధికి కేరాఫ్ అడ్రస్

తక్కువ పెట్టుబడితో ప్రారంభించగల ఈ మిల్లెట్ స్టాళ్లు గ్రామీణ యువతకు, మహిళలకు మెరుగైన ఉపాధిని అందిస్తున్నాయి. టిఫిన్ సెంటర్ల కంటే తక్కువ ఖర్చుతో, పోషకాలతో కూడిన ఆహారం లభిస్తుండటంతో చాలామంది వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. కాలం మారినా ఆహార విలువల ప్రాముఖ్యత మారదని.. సంప్రదాయం వ్యాపారంగా మారినా అది ప్రజారోగ్యానికి మేలు చేకూర్చడం సానుకూల పరిణామమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 23 ఏప్రిల్, 2026



## సోదరుడితో విభేదాలపై కృనాల్ రియాక్షన్





ఐపీఎల్‌లో పాండ్య బ్రదర్స్ (కృనాల్– హార్దిక్) సందడి అంతా ఇంతా కాదు. ఈ సోదరులు ఇద్దరు తమ ప్రదర్శనతో ఈ లీగ్‌లో ఉత్తమ ప్లేయర్లుగా ఎదిగారు. కెరీర్ తొలినాళ్లలో ఈ ఇద్దరూ ముంబయి ఇండియన్స్‌కే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఒక్కరు ఒక్కో టీమ్‌కు ఆడుతున్నారు. అయితే ప్రత్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ పాండ్య బ్రదర్స్ స్పోర్ట్స్ స్పిరిట్ మెచ్చుకునేలా ఉంటుంది. మైదానం బయట కూడా వీళ్లద్దరూ ఇంకా ప్రేమగా ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు ఇటీవల ప్రచారం సాగుతోంది. మరోవైపు, కొంతకాలంగా ఈ ఇద్దరూ మునుపటిలా క్లోజ్‌గా కూడా ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఒకే ఫ్రేమ్‌లో పాండ్య బ్రదర్స్ అసలు కనిపించింది లేదు. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒకరినొకరు పలకరించుకున్నదీ లేదు. అయితే రీసెంట్‌గా ముంబయి ఇండియన్స్– రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో కృనాల్ ఆర్సీబీకి, హార్దిక్ ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు ఎదురుపడ్డప్పుడు మాట్లాడుకుంటారేమో అని అభిమానులు ఎదురుచూశారు. కెమెరాలు కూడా వీళ్లిద్దర్నీ ఫోకస్ చేశాయి. కానీ మ్యాచ్ సందర్భంగా ఎదురుపడినప్పటికీ పాండ్య బ్రదర్ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య విభేదాలు నిజమేనని అంతా అనుకుంటున్నారు! అయితే తమ సోదరుల మధ్య అంతా సవ్యంగా లేదన్న వార్తలపై కృనాల్ స్పష్టతనిచ్చాడు. తాజాగా అతడు ఆర్సీబీ ఇన్?సైడర్స్ మిస్టర్ నాగ్స్? ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో 'గతేడాది నువ్వు నా షోకు రాలేదు. అప్పుడు నేను ఫోన్ చేస్తే నువ్వు ఫ్యామిలో బిజీగా ఉన్నానని చెప్పావు. అంటే ఆర్సీబీ నీ ఫ్యామిలీ కాదా?' అని అడిగాడు. దీనికి కృనాల్ 'ఆర్సీబీ కూడా నా ఫ్యామిలీనే. నేను చెప్పాను కానీ నువ్వు సరిగ్గా విననట్లు ఉన్నావు. అయితే ఇంట్లో అనేకమంది ఫ్యామిలీ మెంబర్స్ ఉంటారు. కానీ ఒక్కోసారి ఒకరిని మిస్ అవుతాము' అని అన్నాడు. దీనికి నాగ్స్ వెంటనే 'మీ సోదరుడి లాగానే' అని అన్నాడు. దీనికి కృనాల్ నవ్వేశాడు. ఈ క్రమంలోనే తమ బ్రదర్స్ మధ్య అంతా సవ్యంగానే ఉందా? అని కృనాల్?ను నాగ్స్ అడిగాడు. ?"మీ ఇద్దరి మధ్య అంతా బాగానే ఉందా? లేదా ఏమైనా గొడవలు జరుగుతున్నాయా?" అని అడగ్గా, కృనాల్ ఒక్కసారిగా నవ్వేశాడు. అప్పుడు హోస్ట్ "కేన్, అండర్‌టేకర్ కూడా కొన్నిసార్లు గొడవ పడతారు అది కామనే" (రెజ్లర్లను ఉద్దేశించి) అని వ్యాఖ్యానించాడు. దీనికి "అంతా బాగానే ఉంది" అని కృనాల్ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అన్మదమ్ముళ్ల మధ్య గొడవలు అన్న ప్రచారానికి ఫుల్? స్టాప్ పడినట్లే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.


## అభిషేక్ చిరస్మరణీయ ఇన్నింగ్స్



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ అదరగొట్టాడు. ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోస్తూ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను ఆడాడు. 47 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 68 బంతుల్లో 135 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 10 సిక్సర్లు ఉన్నాయి. ఈ క్రమంలోనే పలు రికార్డులను అందుకున్నాడు. 50 బంతుల్లోపు రెండు ఐపీఎల్ సెంచరీలను సాధించిన తొలి భారత క్రికెటర్‌గా అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు. అభిషేక్ 2025 ఐపీఎల్‌లో పంజాబ్‌పై 40 బంతుల్లోనే శతకాన్ని సాధించాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయ ప్లేయర్‌గా విరాట్ కోహ్లితో కలిసి సంయుక్తంగా నిలిచాడు. ఈ క్రమంలో అతడు రోహిత్ శర్మను అధిగమించాడు. టీ20ల్లో ఇప్పటి వరకు అభిషేక్ శర్మ 9 సెంచరీలు చేశాడు. ఇందులో ఐపీఎల్‌లో రెండు, టీమిండియా తరుపున రెండు సెంచరీలు ఉండగా.. మిగిలినవి దేశవాళీ టీ20 క్రికెట్‌లో చేశాడు. ఇక టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ శర్మ చోటు సంపాదించుకున్నాడు. ఈ జాబితాలో నాలుగో స్థానంలో అభిషేక్ శర్మ ఉండగా.. 22 సెంచరీలతో ఈ జాబితాలో క్రిస్‌గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓ టీ20 ఇన్నింగ్స్‌లో 10 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లును అభిషేక్ శర్మ 5 సార్లు నమోదు చేశాడు. ఈ జాబితాలో క్రిస్‌గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. 18 సార్లు అతడు ఈ ఘనతను సాధించాడు. శ్రేయస్ అయ్యర్, ఎవిన్ లూయిస్‌లు చెరో నాలుగు సార్లు ఈ ఘనతను నమోదు చేశారు. అభిషేక్ శర్మ చేసిన స్కోరు ఐపీఎల్‌లో ఐదో వ్యక్తిగత అత్యధిక స్కోరుగా నిలిచింది. 175 పరుగులతో క్రిస్‌గేల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా 158 పరుగులతో బ్రెండన్ మెక్‌కల్లమ్ రెండో స్థానంలో నిలిచాడు.

# ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?

ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్.ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.





# కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ

### జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ




రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవు తోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరి యర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీ యంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమా చారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం.సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్





కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.

# సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది.

ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ




సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట్ 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.